
కంది.. కొనేదెన్నడో?



పుట్లూరు సమీపంలో కంది పంటను కుప్పలుగా ఉంచిన దృశ్యం, ఆరబెట్టిన కందులు

- తాడిపత్రి డివిజన్‌లో ప్రారంభం కాని కంది కొనుగోళ్లు
- ఎప్పుడు కొంటారని ఎదురుచూపు
- దళారుల చేతిలో నష్టపోతున్న రైతులు

పుట్లూరు: వేరుశనగ పంట సాగుతో నష్టపోయాం.. కనీసం కంది పంట అయినా గట్టెక్కిస్తుందనుకుంటే ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని రైతులు నిరాశ చెందుతున్నారు. పది రోజుల నుంచి జిల్లాలోని అన్ని మండలల్లో కంది కొనుగోళ్లు ప్రారంభించినా తాడిపత్రి వ్యవసాయ డివిజన్ పరిధిలోని మండలాల్లో ఇంకా ప్రారంభించలేదు. ఓ వైపు మార్కెట్‌లో కంది ధరలు తగ్గిపోతుండడంతో .. మరోవైపు ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ప్రభుత్వం క్వింటా కందులు రూ.7,550తో కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించడంతో కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

తగ్గిన దిగుబడి..

ఈ ఏడాది ఖరీఫ్‌లో కంది సాగు చేసిన రైతులు పంట దిగుబడి తగ్గడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ప్రతి మండలంలో కంది పంటను కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటిస్తున్నారేగానీ కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించలేదని ఆందోళన చెందుతున్నారు.

తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో కంది పంట సాగు వివరాలు ఇలా....

మండలం	కంది సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
తాడిపత్రి	1,958
పుట్లూరు	958
పెద్ద పప్పూరు	450
యల్లనూరు	277
మొత్తం	3,643

నాణ్యత పేరుతో ఇబ్బందులు..

అరకొరగా దిగుబడి వచ్చిన కంది పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే సమయంలో నల్ల గింజలు, తెల్ల గింజలు అంటూ పలు రకాల నాణ్యత పేరుతో క్వింటాల్‌కు రూ.5,500 నుంచి రూ.6వేల లోపు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తుండడంతో గిట్టుబాటు కాలేదని నిరాశ చెందుతున్నారు.

వెంటనే కొనుగోలు చేయాలి..



గిట్టుబాటు ధర లేక కంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దిగుబడి తగ్గిపోవడంతో పాటు మార్కెట్‌లో క్వింటా కందుల ధర గరిష్ఠంగా రూ.6,500 లోపు మాత్రమే లభిస్తోంది. ప్రభుత్వం క్వింటా రూ.7,550 ప్రకారం మద్దతు ధర ప్రకటించినా క్షేత్ర స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. అధికారులు వెంటనే కందుల కొనుగోళ్లు ప్రారంభించాలి.
– సూరి, కడవకల్లు, పుట్లూరు మండలం

కందులు కొనుగోలు చేస్తాం



మండలంలో కంది పంటను ఆలస్యంగా సాగు చేయడం వల్ల ఇప్పటికీ కోత, నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. అన్ని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రారంభించాం. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి కందులను కొనుగోలు చేస్తాం. తేమ 12 శాతం లోపు ఉండేలా రైతులు గింజలను ఆరబెట్టుకోవాలి. పుట్లూరులో సొసైటీ (పీఏసీఎస్) ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందులు కొనుగోలు చేస్తాం.
– కాత్యాయని, వ్యవసాయ అధికారిణి, పుట్లూరు

నులిపురుగుల నివారణపై దృష్టి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ అనుపమ

యాడికి: టీబీ రోగుల ఇంటి వద్దకే వెళ్లి మందులు అందజేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ అనుపమ ఆదేశించారు. శనివారం మండలంలోని రాయలచెరువు, యాడికి పీహెచ్‌సీలను సందర్శించారు. టీబీ, లెప్రసీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలో 12 మంది టీబీ రోగులు ఉండగా.. లెప్రసీ రోగులు ఎవ్వరూ లేరన్నారు. ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలు, 50 ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. అనంతరం నులిపురుగుల నిర్మూలన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీల వైద్యులు పరమేశ్వర్, దేవరాజన్, తాడిపత్రి మలేరియా అధికారి శ్రీనివాసులు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని ప్రజలందరూ నులిపురుగుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పి.వీరన్నపల్లిలో నులిపురుగుల నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 19 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. నులి పురుగులు ఎక్కువగా ఉన్న పిల్లలకు కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు.

బీజేపీ నాయకుల విజయోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గుంతకల్లుటౌన్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించడంతో స్థానిక ఆ పార్టీ నాయకులు శనివారం పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్‌రోడ్డులోని ఇల్లూరు గోపాలక్రిష్ణ భవనం ఎదుట బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు వడ్డేరమేష్, రవిబాబు మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అందిస్తున్న జనరంజకపాలనను మెచ్చి ఢిల్లీ ప్రజలు బీజేపీకి పట్టంకట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలిమి రామాంజి, మహేష్, శేకన్న, పురంధర్, రంగన్న, విజయలక్ష్మి, రాఘవ, జనార్దన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో..

తాడిపత్రి అర్బన్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు శనివారం స్థానిక యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. బాణా సంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్ యాదవ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీరంగయ్య, లక్ష్మీనారాయణ, యువమోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పృథ్వీరాజ్, ఓబిసి మోర్చా రాయలసీమ ఇన్‌చార్జ్ రామాంజనేయులు, పట్టణాధ్యక్షుడు కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



గేట్స్‌లో సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 3 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శనివారం ముగిసింది. గేట్స్ హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ నావెల్ డ్రగ్ డెలివరీ అనే అంశంపై కార్యక్రమం జరిగింది. దక్షిణ కొరియా, అమెరికా, చీలీ దేశాలకు చెందిన పలు యూనివర్సిటీల ప్రొఫెసర్లు ఆన్‌లైన్‌లో ఫ్యాకల్టీలకు నావెల్ డ్రగ్ డెలివరీపై అవగాహన కల్పించారు. పాలిమర్ డ్రగ్ డెలివరీ అనే నూతన విధానం ద్వారా క్యాన్సర్, టిష్యూ ఇంజినీరింగ్, పిన్ ట్రాక్టీస్ క్యాన్సర్లకు సమగ్రంగా చికిత్స చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి సుమారు 300 మంది అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, డాక్టర్ హరిప్రియ, కో–ఆర్డినేటర్లు ఎర్రిస్వామి, ఝాన్సీ, శివయ్య పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గుత్తి రూరల్: ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. కొత్తపేట గ్రామంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసిన డీఎస్సీ పోస్టుల భర్తీ ఊసే లేదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014–19 మధ్యలో చంద్రబాబు కేవలం 34,108 ఉద్యోగాలు కల్పిస్తే మాజీ సీఎం జగన్ ఒక్క నోటిఫికేషన్‌తో 1.25 లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పించారన్నారు. మాజీ సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగాలు 44 వేలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు 3.73 లక్షలు భర్తీ చేశారన్నారు. 2019లో చంద్రబాబు దిగిపోయే రోజుకు రాష్ట్రంలో 3,97, 128 మంది ఉద్యోగులు ఉంటే 2024లో జగన్ దిగిపోయే సమయానికి 6.48 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారంటే ఎవరి హయాంలో ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో తెలుస్తోందన్నారు. వైఎస్.జగన్ ఐదేళ్లలో 23వేల టీచర్ పోస్టులు భర్తీ చేశారని గుర్తు చేశారు. కౌన్సిలర్ వరదరాజులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మారెడ్డి, సుబ్బు ఆచారి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక పుట్లూరు రోడ్డులో పర్యటించారు. ఈ సందర్భంగా దుకాణాల వద్దకు వెళ్లి అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. టీ స్టాల్ వద్దకు వెళ్లి వ్యాపారాలు జరుగుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. విద్యుత్ దీపాలు లేవని కొందరు చెప్పడంతో వెంటనే అధికారులతో మాట్లాడారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాయకులు జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్‌కు జాతీయ అవార్డు



చిన్న పుల్లయ్యను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిన్న పుల్లయ్యకు నేషనల్ ప్రేరణ దూత్ 2024–25 అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఈ అవార్డును చిన్న పుల్లయ్య బీహార్‌లోని చాప్రా పట్టణంలోని పేస్ ఆఫ్ ఫ్యూచర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నట్లు ఆయన తెలిపారు. చిన్న పుల్లయ్యను కళాశాల యాజమాన్యం అభినందించింది.

సంక్షిప్త సమాచారం

నేడు కోటంకలో అన్నదానం

గార్లదిన్నె: మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏటా మాఘమాసంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్లో భాగంగా తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం భార్య వెంకట సుబ్బమ్మ, కుమారులు కొండారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

అధికారుల పర్యటన

శింగనమల: మండలంలోని అలంకరాయునిపేట గ్రామంలో మండల అధికారులు శనివారం పర్యటించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కొన్ని రోజుల క్రితం శింగనమలలో జరిగిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సొంతూరు అభివృద్ధిపై వినతిపత్రం అందించారు. దీంతో శనివారం తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ భాస్కర్, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మమ్మ, ఏపీఓ శ్రీదేవి, వీఆర్ఓ , సర్వేయర్, తదితర అధికారులు గ్రామంలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పెట్రోల్, డీజిల్ అమ్మకాలను అరికట్టండి

పామిడి: పట్టణంలో కర్ణాటక పెట్రోల్, డీజిల్ అమ్మకాలను అరికట్టాలని పెట్రోల్ బంకు నిర్వాహకులు కోరారు. ఈమేరకు శనివారం సీఐ యుంగధర్‌కు వినతిపత్రం అందజేశారు. కొందరు కర్ణాటక నుంచి అక్రమంగా తెచ్చుకున్న పెట్రోలు, డీజల్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. తద్వారా తమ వ్యాపారానికి పూర్తి గండి పడుతోందన్నారు.

ఘనంగా షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో శనివారం షిరిడీ సాయిబాబా ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆలయంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్: ఆశావర్కర్ల యూనియన్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి తెలిపారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశావర్కర్లకు కనీస వేతనం కింద నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టిఖర్చులు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సాకే నాగరాజు, అధ్యక్ష, కార్యదర్శులుగా భాగ్య, ప్రమీళ, సభ్యులుగా విమల, రెహానాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

చెరువు నాగమ్మ ఆలయ వార్షికోత్సవం

గుంతకల్లు: ఎస్.తిమ్మాపురం గ్రామంలో శనివారం చెరువు నాగమ్మ ఆలయంలో 21వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వేద పండితులు చండీ హోమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ యుగంధర్‌రెడ్డి, మల్లికార్జునశాస్త్రి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

ఎన్‌పీకుంట: గూటిబైలు గ్రామంలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మమర్రిమానును శనివారం గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తిమ్మమాంబ ఆలయ కమిటీ సభ్యులు జడ్జి కటుంబ సభ్యులకు స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. అనంతరం జడ్జి తిమ్మమాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టూరిజం గైడ్ మనోహర్ మర్రిమాను విశిష్టత, ఆలయ చరిత్రను వివరించారు.

ఘనంగా మౌలాలి స్వామి జియారత్



స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

గుత్తి రూరల్: ఊటకల్లు గ్రామంలో మౌలాలి స్వామి జియారత్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మౌలాలి స్వామిని రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కొండపై నుంచి మౌలాలి స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోకి తెచ్చి ఫకీర్ల మేళతాళాలతో గుర్రంపై ఉంచి ఊరేగించారు. దర్గాలో ముజావర్లు స్వామికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. భక్తులు స్వామికి చక్కెర చదివింపులు చదివించారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని మాసినేని పాఠశాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. గార్లదిన్నెకు చెందిన రాము అనే వ్యక్తి గుత్తిలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మాసినేని పాఠశాల సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రామును స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాసబాబు

పెద్దవడుగూరు: ప్రభుత్వ, ప్రయివేటు వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శ్రీనివాసబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలికల, బాలుర వసత గృహాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. రోజూ భోజనం చేసే సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. స్నానం చేసే సమయంలో ఎవరి వస్తువులు వారే వినియోగించాలని తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకరావాలన్నారు. పది విద్యార్థులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సరైన వెలుతురు ఉన్న ప్రదేశంలో చదవడం వలన కలిగే లాభాలను వివరించారు. దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, ఆరోగ్య సిబ్బంది, రాజమ్మ, ఆశా ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రహదారిపై లారీ బోల్తా



బుక్కరాయసముద్రం: మండలంలోని హెచ్ఎల్‌సీ కెనాల్ సమీపంలో అనంతపురం– తాడిపత్రి రహదారిపై శనివారం లారీ బోల్తాపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి వైపు నుంచి అనంతపురానికి వెళ్తున్న కట్టెల లోడుతో వెళ్తున్న లారీ కెనాల్ సమీపంలో రహదారిపై వేగంగా వస్తూ డివైడర్‌ను ఢీకొని, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద గ్రామంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవం వైభవంగా జరిగింది. గ్రామ పెద్ద బండ్లపల్లి కేశవరెడ్డి కుమారుల భాస్కర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం కల్యాణం చేయించారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణం, 12 గంటలకు మహా మంగళహారతి, 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు చెన్నకేశవస్వామి ఉత్స విగ్రహాలు గ్రామోత్సవం ఉదయం 6 గంటలకు గజ్జెపూజ, రాత్రి 8 గంటలకు చెక్క భజన నిర్వహించారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా పెట్టుకోండి



మాట్లాడుతున్న సీఐ మస్తాన్

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా పెట్టుకోవాలని టూటౌన్, రూరల్ సీఐలు మస్తాన్, ప్రవీణ్ అభ్యర్థులకు సూచించారు. పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్, ఆర్ఆర్‌బీ గ్రూప్–డీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను శనివారం వారు ప్రారంభించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర, ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ శ్రీనివాసులు, శ్రీసాయి కాలేజీ కరస్పాండెంట్ ప్రభాకర్, అధ్యాపకులు డాక్టర్ హనుమంతరెడ్డి, తిమ్మప్ప, ఫక్కీరప్ప, శేషఫణి, మల్లికార్జున, హరికృష్ణ, ఎల్ఐసీ డీఓ తారకేష్, విద్యార్థి నాయకులు సి.రమేష్, సునీల్, రమేష్ బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

పెద్దవడుగూరు/గుంతకల్లు/పామిడి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని పెద్దవడుగూరు, గుంతకల్లు, పామిడిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసీమాల పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. అర్చకులు భీష్మ ఏకాదశి విశిష్టతను వివరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

శేషవాహనంపై రంగనాథుడు



శేషవాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బొలికొండ రంగనాథుడు శేషవాహనోత్సవంపై విహరించాడు. శనివారం రాత్రి రంగనాథుడి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు ఇచ్చిన శేష వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా గ్రామ శివారులోని జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమద్ వాహనోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

దైవచింతన కలిగి ఉండాలి



మండపాన్ని ప్రారంభిస్తున్న విజయానంద తీర్థస్వామీజీ, తదితరులు

పామిడి: ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని మైసూరు దత్తపీఠం ఉత్తర పీఠాధిపతి విజయానంద తీర్ద స్వామీజీ అన్నారు. శనివారం ఆయన స్థానిక దత్తపాదుకా క్షేత్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన మండపాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని మీద భక్తిభావం మనిషిని సన్మార్గంలోకి నడుపుతుందన్నారు. తద్వారా మానవ జీవితాలు ఆనందకరమవుతాయన్నారు. దేవునికి భక్తునికి మధ్య సంబంధం గురుశిష్యుల వంటిదన్నారు. అంతకుముందు స్వామీజీకి గురుదత్త సేవాసమితి సభ్యులు ఎంహెచ్ లక్ష్మీ నారాయణరెడ్డి, ఎస్ఎస్ఎం శ్రీధర్ ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా స్వామీజీ ఆలయంలో దత్తాత్రేయ, నవగ్రహ, కార్యసిద్ధి ఆంజనేయస్వామి, నాగులు, గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దత్త పాదుకా క్షేత్రం దత్త నామస్మరణతో మార్మోగింది.


అక్షర విద్యార్థుల ప్రతిభ



బహుమతులు చూపుతున్న అక్షర పాఠశాల విద్యార్థులు

గార్లదిన్నె: స్థానిక అక్షర ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు లైవ్ ఇన్ హెల్తీ స్పేస్ డిజైన్ కాంటెస్ట్‌లో ప్రతిభ కనబరిచినట్లు ఏజీఎం రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏటా ఎన్ఎస్ఎస్ సంస్థ లైవ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్ డిజైన్ కాంటెస్ట్‌లో 9 మంది అక్షర పాఠశాల విద్యార్థులు పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సాదక్ వలి, ప్రిన్సిపాల్ నరేష్, డీన్ జుల్ఫతన, పోతులయ్య, జగదీష్, ఏఓ బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బీకేఎస్ విద్యార్థులు



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ గోపాల్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో 9వ తరగతి చరణ్ సంధ్య, పల్లవి ఉమ్మడి జిల్లాల బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. వీరు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు కాకినాడలోని పిఠాపురంలో జరగనున్న యూత్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.